

జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే గాంధీ, చందానగర్ కార్పొరేటర్ మంజులా రఘునాథ్‌రెడ్డి, నాయకులు



చందానగర్‌లో.. కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జీ జగదీశ్వర్‌గౌడ్ తదితరులు



శేరిలింగంపల్లిలో .. సీనియర్ కాంగ్రెస్ నాయకులు రఘునాథ్‌యాదవ్, నాయకులు

గణతంత్ర దినోత్సవం

శేరిలింగంపల్లి జోన్‌బృందం: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం శేరిలింగంపల్లి జంట సర్కిళ్లలో త్రివర్ణ పతాకం రెపరెపలాడింది. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, అలాగే కొండాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, చందానగర్, మియాపూర్, హఫీజ్‌పేట్ డివిజన్లలో కార్పొరేటర్లు షేక్ హమీద్‌పటేల్, గంగాధర్‌రెడ్డి, రాగం నాగేందర్ యాదవ్, మంజులారెడ్డి, ఉప్పలపాటి శ్రీకాంత్, కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జీ జగదీశ్వర్‌గౌడ్, ఖాజాగూడలో మాజీ కార్పొరేటర్ సాయిబాబా తదితరులు జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. అలాగే ఆయా పార్టీల కార్యాలయాలు, కార్మిక సంఘాల కార్యాలయాలు, ఆటోస్టాండ్లలో జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. పలు కూడళ్లు, అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీ ప్రాంగణాలో వేడుకలు నిర్వహించారు.



శేరిలింగంపల్లి విద్యాంజలి స్కూల్‌లో చిన్నారుల నృత్య ప్రదర్శన



గచ్చిబౌలి నాసర్ స్కూల్‌లో గణతంత్ర వేడుకల్లో విద్యార్థులు



పటాన్‌చెరు మైత్రీగ్రౌండ్‌లో ..



గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ ఆవరణలో జెండా వందనం చేస్తున్న పోలీసు అధికారులు



శేరిలింగంపల్లిలో.. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్, నాయకులు





ఖాజాగూడలో.. మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా తదితరులు



శేరిలింగంపల్లి వెస్ట్‌జోన్ కార్యాలయంలో.. జెడ్సీ, డీసీ, కార్పొరేటర్లు, అధికారులు, వివిధ పార్టీల నాయకులు



గౌలిదొడ్డిలోని వార్డు కార్యాలయంలో.. గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, నాయకులు, వార్డు కమిటీ సభ్యులు



హెచ్‌సీయూలో.. వీసీ ప్రొ.బీజే రావు పతాకావిష్కరణ



హెచ్‌సీయూ క్యాంపస్ స్కూల్‌లో..



కొండాపూర్‌లో.. కార్పొరేటర్ షేక్ హమీద్‌పటేల్



గచ్చిబౌలిలోని 'ఎస్కీ' కార్యాలయంలో ..

విద్యార్థి దశలో క్రీడల పట్ల ఆసక్తి కనబరిస్తే రాణిస్తారు

- ప్రముఖ అంతర్జాతీయ క్రీడాకారిణి నందిని అగసర
- రాయదుర్గం ఒయాసిస్ స్కూల్‌లో వార్షిక క్రీడోత్సవాలు



ఒయాసిస్ స్కూల్‌లో క్రీడోత్సవాలు

రాయదుర్గం: చిన్ననాటి నుంచే క్రీడల పట్ల ఆసక్తి కనబరిస్తే భవిష్యత్తులో రాణిస్తారని ప్రముఖ అంతర్జాతీయ అథ్లెటిక్స్ క్రీడాకారిణి నందిని అగసర పేర్కొన్నారు. రాయదుర్గంలోని ఒయాసిస్ స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో శుక్రవారం వార్షిక క్రీడోత్సవాలను ఆమె జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ రోజూ నచ్చిన క్రీడను ఆడాలని సూచించారు. అనంతరం విద్యార్థుల మార్చ్‌ఫాస్ట్ ఆకట్టుకుంది. పలు రకాల క్రీడాపోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో ఒయాసిస్ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు రాఘవరెడ్డి, ఎగ్జిక్యూటివ్ కార్యదర్శి పి సుబ్బారెడ్డి, కోశాధికారి జి ఏకాంబరరెడ్డి, ప్రిన్సిపల్ ఉషా, కరస్పాండెంట్ జి శ్రీవిద్యారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పీఈటీలు పాల్గొన్నారు.

జాతీయ చేనేత వస్త్ర ప్రదర్శన ప్రారంభం

మాదాపూర్: శిల్పారామంలో నేషనల్ హ్యాండ్‌లూమ్ ఎక్స్‌పో గాంధీ బుణాకర్ మేళాను శుక్రవారం శిల్పారామం ప్రత్యేక అధికారి జి.కిషన్‌రావు ప్రారంభించారు. ఉప్పాడ, పోచంపల్లి, గద్వాల్, గొల్లభామ, బెంగుళూరు సిల్క్, కొసపట్టు, బనారసీ పట్టు, ఖాదీషర్ట్స్, ఖాదీ మెటీరియల్, తనేరియా కాటన్ తదితర ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వీవర్స్ సర్వీస్ సెంటర్ హెడ్ అరుణ్‌కుమార్, శిల్పారామం మేనేజర్ అంజయ్య పాల్గొన్నారు.

అలరించిన త్యాగరాజ కీర్తనలు..

త్యాగరాజ ఆరాధనోత్సవాల్లో భాగంగా యువ కళాకారిణి శ్రీయ మారెళ్ళపూడి త్యాగరాజ కీర్తనలతో, విద్వాన్ శేషం రమణ శిష్యబృందం వేణునాదం, విదూషీ డాక్టర్ రామవరపు మాధురిదేవి వీణ వాదనతో అలరించారు. వయోలిన్ విద్వాన్ కెఎల్ఎన్ మూర్తి, మృదంగం డీఎస్ఆర్ మూర్తి, ఘటం విద్వాన్ రవీంద్ర తేజస్వీ అందించారు.

తైకా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ప్రారంభం

- ప్రారంభించిన సినీ నటుడు సుమన్



విజేతలకు బహుమతులు ఇస్తున్న సినీ నటుడు సుమన్

మియాపూర్ : మియాపూర్‌లోని మయూరినగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన తైకా మార్షల్ ఆర్ట్స్ అకాడమి 5వ బ్రాంచ్‌ను సినీ హీరో సుమన్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మార్షల్‌లో విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో తైకా అధినేత డాక్టర్ అశోక్ చక్రవర్తి, మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, రాజుగోపాల్‌రావు, మయూరినగర్ ప్రెసిడెంట్ నారాయణరావు, కిషోర్‌కుమార్, మురళి, నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్రీరామ్ శోభాయాత్ర

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్‌లో శనివారం శ్రీరామ్ శోభాయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి తెలిపారు. ఈ యాత్ర ఉదయం 8.30 గంటలకు నల్లగండ్ల అపర్ణా సైబర్‌జోన్ గేటెడ్ కమ్యూనిటీ నుంచి గోపన్‌పల్లిలోని రంగనాథస్వామి ఆలయం వరకు కొనసాగుతుందన్నారు.అపర్ణా సైబర్‌జోన్ నుంచి పరిసరాల్లోని గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్ వాసులంతా ఈ యాత్రలో పాల్గొంటారన్నారు. అనంతరం రంగనాథుడికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు ఉంటాయని వివరించారు. అనంతరం మధ్యాహ్నం 12.30 భక్తులందరికీ అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు. ఈ యాత్రలో రామభక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

హ్యాట్రిక్ విజయం మరింత బాధ్యతను పెంచింది

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: నియోజకవర్గ పరిధిలోని రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు.పటాన్‌చెరు పట్టణంలోని మున్నూరు కాపు కళ్యాణ మండపంలో రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అభినందన సభకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పటాన్‌చెరు నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదంతో మూడోసారి హ్యాట్రిక్ విజయాన్ని సాధించడం జరిగిందని, ఈ విజయం మరింత బాధ్యతను పెంచిందని తెలిపారు. అనంతరం కళ్యాణ మండపం ఆవరణలో నూతనంగా నిర్మించిన సీసీ ఫ్లోరింగ్‌ను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయకుమార్, రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం నాయకులు, మున్నూరు కాపు సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

హైదరాబాదీ చాయ్.. రాయల్ నిజాం వంటకాలు

మాదాపూర్: హైదరాబాదీలను ఆకట్టుకునే పత్తర్‌కాఘోష్, స్పెషల్ బిర్యానీలు హౌస్ ఆఫ్ బగారాలో అందుబాటులో ఉన్నాయి. మాదాపూర్‌లోని దుర్గం చెరువు వద్ద ఈ రెస్టారెంట్‌ను శుక్రవారం నిర్వాహకులు మానినే, శ్రీకర్‌లు ప్రారంభించారు.హైదరాబాదీ చాయ్, హలీం, బిర్యానీలు, తెలంగాణ మటన్ కర్రీ, పత్తర్‌కాఘోష్, జుగల్‌బందీ బిర్యానీ, మొఘలాయ్ రాన్, రాయల్ నిజామీ వంటకాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

'సండే ఈవినింగ్ టాక్'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమాన్ని నిర్వహిస్తారు, సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. 'హీలింగ్ ఆఫ్ ది సబ్‌కాన్సియస్' అనే అంశంపై యూకేలోని కేంబ్రిడ్జికి చెందిన డాక్టర్ ప్రశాంత్ కాకోడే ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ 040–23001234లో సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.

గోపన్‌పల్లిలో స్థల వివాదం

గచ్చిబౌలి: గోపన్‌పల్లిలో స్థల వివాదం నెలకొంది. రంగనాథనగర్‌లో కొందరు వ్యక్తులు స్థలం మాదేనంటూ ఫెన్సింగ్‌ను తొలగించారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు రంగనాథనగర్ స్థలాల యజమానులు అక్కడికి చేరుకున్నారు. ఫెన్సింగ్ రేకులను తొలగించారు. దీంతో అక్కడి సెక్యూరిటీ సిబ్బంది గచ్చిబౌలి పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు అక్కడికి చేరుకుని వారించారు.

స్థలం మాదే..

ఈ స్థలం తమదేనంటూ రంగనాథనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు. 1987లో 19 ఎకరాల విస్తీర్ణంలో రంగనాథనగర్ లేఅవుట్ వేశారని, జీపీఏ హోల్డర్లు ఎన్‌వీ రమణ, పీఆర్ చౌదరి 650 ప్లాట్లను విక్రయించారని తెలిపారు. 2006లో తమకు అమ్మారంటూ కొందరు వ్యక్తులు వచ్చి 150 ప్లాట్లలో గదులను కూల్చివేసి 2021 అక్టోబర్‌లో పోలీసు బందోబస్తుతో ప్లాట్ల యజమానులను బయటకు పంపారని చెప్పారు. మాజీ మంత్రి అల్లుడు స్థలాన్ని పొజిషన్‌లోకి తీసుకొని చుట్టూ బారికేడ్లు ఏర్పాటు చేశారని వారు వివరించారు. అప్పుడు అధికారుల నుంచి ఎలాంటి సహకారం లేకపోవడంతో రాలేకపోయామన్నారు. నేడు ప్రభుత్వం మారడంతో తమ ప్లాట్లను తీసుకునేందుకు వచ్చినట్లు ఆయన చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని అసోసియేషన్ సభ్యులు కోరారు.



న్యాయం చేయాలని నినాదాలు చేస్తున్న అసోసియేషన్ సభ్యులు

హోరాహోరీగా హైదరాబాద్ ప్రీమియర్ గోల్ఫ్ లీగ్

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ ప్రీమియర్ గోల్ఫ్ లీగ్ నాలుగో సీజన్ హోరాహోరీగా సాగుతోంది. హైదరాబాద్ గోల్ఫ్ క్లబ్‌లో జరిగిన రెండో రౌండ్ పోటీల్లో టాప్ ప్లేస్ కోసం అన్ని జట్ల మధ్య గట్టిపోటీ నడిచింది. లో స్కోరింగ్ నమోదైనప్పటికీ రెండో రౌండ్‌లో విలాగో హైలాండర్స్ టాప్ ప్లేస్‌లో నిలిచింది. 196 పాయింట్లతో ఆ జట్టు అగ్రస్థానంలో నిలవగా...లహరి లయన్స్ , సింథోకెమ్ స్వింగ్ కింగ్స్ 195 పాయింట్ల చొప్పున తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. స్వింగ్ కింగ్స్ ప్లేయర్ నిఖిల్ నంజప్ప 38 పాయింట్లు సాధించి టాప్ స్కోరర్ గా నిలిచాడు. లీగ్ తర్వాతి రౌండ్ పోటీలకు గచ్చిబౌలీ బౌల్డర్ హిల్స్ గోల్ఫ్ క్లబ్ ఆతిథ్యమిస్తోంది. మొత్తం 16 జట్లు 4 గ్రూపులుగా పోటీ పడుతున్నాయి. గ్రూపులో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు నాకౌట్ స్టేజ్ కు అర్హత సాధిస్తాయి. ఈ టోర్నీ మెగా ఫైనల్స్ బ్యాంకాంక్ లోని అతిపెద్ద గోల్ఫ్ కోర్సులో నిర్వహిస్తున్నట్టు లీగ్ కమీషనర్ సుమంత్ డిఎస్ చెప్పారు. ప్రతీ సీజన్ లో గోల్ఫర్లు అత్యుత్తమ ప్రదర్శన కనబరుస్తుండడంతో లీగ్ హోరాహోరీగా సాగుతోందన్నారు. యువగోల్ఫర్లకు హెచ్‌పీజీఎల్ మంచి వేదికగా అభివర్ణించారు.



నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గచ్చిబౌలి ఏఈ వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. నానక్‌రాంగూడ ఫీడర్ పరిధిలో.. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు మంత్రి అపార్ట్‌మెంట్స్, జర్నలిస్ట్‌కాలనీ, పద్మశ్రీగార్డెన్స్, గౌలిదొడ్డి, టీఎన్‌జీవోస్ కాలనీ, గోల్ఫ్‌ఎడ్జ్ అపార్ట్‌మెంట్స్, గోల్ఫ్‌వ్యూ అపార్ట్‌మెంట్స్, నానక్‌రాంగూడ విలేజ్, జయభేరి మిడోస్, జయభేరీ ఫోర్ సీజన్, అపర్ణ శాంగ్రీలా, ఐటీ ఏరియా, యూనియన్ బ్యాంక్, బ్రిగేడ్, లెమన్ ట్రీ హోటల్, ఆరంజ్‌కౌంటీ, వరుణ్ మోటార్స్, ఎమ్మార్ ప్రాపర్టీస్, హెచ్‌ఎండీఏ బిల్డింగ్, విజయకృష్ణ టవర్స్, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మధురానగర్, టింబర్ లేక్‌కాలనీ, ఐటీ హైట్స్, ఆంధ్రబ్యాంక్, ప్రశాంత్‌హిల్స్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని పేర్కొన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

◆ మరమ్మత్తుల కారణంగా మధ్యాహ్నం 12 గంటల నుంచి 1 గంట వరకు ఏపీహెచ్‌బీ కాలనీ, డీఎల్ఎఫ్ గేట్ నెంబర్ 1,2,3, డాగ్‌పార్క్, లీ మెరీడియన్, రాడిసన్ హోటల్,గచ్చిబౌలి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని గచ్చిబౌలి ఏఈ వేణుగోపాల్ పేర్కొన్నారు.

కొండాపూర్‌లో...

వైట్‌ఫీల్డ్ సబ్‌స్టేషన్ పరిధిలో.. శనివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు శ్రీరాంనగర్ బ్లాక్, చిరాక్ స్కూల్, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు మసీద్ బండ మెయిన్‌రోడ్డు, సీఎంసీ లేఅవుట్‌లో విద్యుత్‌సరఫరా ఉండదని ఏఈ కిశోర్ తెలిపారు.

శేరిలింగంపల్లిలో..

శేరిలింగంపల్లి: 33/11 కేవీ నల్లగండ్ల సబ్‌స్టేషన్ పరిధిలో.. 11 కేవీ ఎపిస్టిమో ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నల్లగండ్ల హుడా కాలనీ, సాధన స్కూల్, ఎపిస్టిమో గ్లోబల్ స్కూల్, నల్లగండ్ల–తెల్లాపూర్ రోడ్డులో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏఈ వెంకటనారాయణరెడ్డి తెలిపారు.

◆ 11కేవీ లక్ష్మీవిహార్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు లక్ష్మీవిహార్ ఫేజ్–1, 2 కాలనీలు, నల్లగండ్ల విలేజ్, రెడ్డిబస్తీ, డాక్టర్స్ కాలనీ పార్ట్‌లో విద్యుత్ ఉండదని తెలిపారు.

మియాపూర్ : హైదర్‌నగర్, రాంనరేష్‌నగర్ ఫీడర్ మరమ్మతుల కారణంగా ..ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు బృందావన కాలనీ, హైదర్‌నగర్, అదేవిధంగా మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఓల్డేజ్ హోం ప్రాంతం ఏరియా, మిత్రహిల్స్, ప్రశాంత్‌నగర్, ఏఎస్ రాజునగర్, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర ప్రాంతాలలో విద్యుత్ ఉండదని ఏఈ హరీష్‌సింగ్ తెలిపారు.

వేమన కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో..

హఫీజ్‌పేట్ : వేమన కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలోని కెఎస్ఆర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు కెఎస్ఆర్ రోడ్డు, రోడ్డు నంబర్లు 2,4,6,8,9,20,12 తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రాజేందర్ తెలిపారు.

◆ పీజేఆర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2.00 గంటల నుంచి 5.00 గంటల వరకు పీజేఆర్ ఏరియా, రోడ్డు నంబర్లు 1,3,5,7,10,12 తదితర ప్రాంతాలలో విద్యుత్ ఉండదని ఏఈ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని వినతి



జగదీశ్వర్‌గౌడ్‌ను కలిసిన స్కైవుడ్ అపార్ట్‌మెంట్‌వాసులు

రాయదుర్గం: గోపన్‌పల్లిలోని చిన్న, పెద్ద చెరువు వరకున్న కచ్చా నాలాతో సమస్యలు తీవ్రమవుతున్నాయని, పరిష్కరించాలని స్కైవుడ్ అపార్ట్‌మెంట్స్‌వాసులు కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జీ జగదీశ్వర్‌గౌడ్‌ను కలిసి వినతిపత్రాన్ని అందించారు. అపార్ట్‌మెంట్ల ముందు, రోడ్డుకు, అపార్ట్‌మెంట్‌కు మధ్య ఉన్న స్థలంలో మురుగుతో నిత్యం అవస్థ పడుతున్నామని వారు వివరించారు. దుర్వాసనతోపాటు వర్షాకాలంలో నీరంతా పొంగి అపార్ట్‌మెంట్‌ల వైపు వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యేలా చూస్తామన్నారు. ఆయనను కలిసినవారిలో స్కైవుడ్స్ అసోసియేషన్ సభ్యులు విద్యాధర్, శ్రీనివాస్‌రెడ్డి, పిబిరెడ్డి పాల్గొన్నారు.

'స్టేట్ ఆఫ్ జాయ్' చిత్ర ప్రదర్శన





మాదాపూర్: మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్‌గ్యాలరీలో శుక్రవారం ఏర్పాటు చేసిన స్టేట్ ఆఫ్ జాయ్ చిత్రప్రదర్శనను ఐటీ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్‌రంజన్ ప్రారంభించారు. కళాకారులు వేసిన చిత్రాలు సందేశాత్మకంగా ఉన్నాయని కొనియాడారు. ఈనెల31వ తేదీ వరకు ప్రదర్శన ఉంటుంది. కార్యక్రమంలో ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్ డాక్టర్ కె.లక్ష్మీ, ఆర్ట్ లవర్ అంజుపొద్దార్, ఎడిటర్ రత్నారావు,కళాకారులు పాల్గొన్నారు.

శేరిలింగంపల్లి ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌కు ప్రశంసాపత్రం



హఫీజ్‌పేట్ : రిపబ్లిక్ డేను పురస్కరించుకొని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శేరిలింగంపల్లి మండల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్‌గౌడ్‌కు శుక్రవారం ప్రశంసాపత్రం అందజేశారు. శేరిలింగంపల్లి మండలంలో 200 కిలోల గంజాయి పట్టుకున్న నేపథ్యంలో ప్రశంసాపత్రం అందుకున్నట్టు ఆయన తెలిపారు.

డ్రైవర్లు విధిగా నిబంధనలు పాటించాలి

- గచ్చిబౌలి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్‌రెడ్డి



హెచ్‌సీయూ డిపోలో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్‌రెడ్డి

రాయదుర్గం: రోడ్డు భద్రత నిబంధనలను డ్రైవర్లు విధిగా పాటించాలని గచ్చిబౌలి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎస్ రాజశేఖర్‌రెడ్డి సూచించారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ ఆర్టీసీ డిపోలో డ్రైవర్లకు రోడ్డు భద్రతపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి ఒత్తిడి లేకుండా రోడ్డుపై వాహనం నడిపితే ప్రమాదాలు చోటు చేసుకోవన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసు అధికారులు, హెచ్‌సీయూ డిపో అధికారులు, ఉద్యోగులు, డ్రైవర్లు పాల్గొన్నారు.